క్లుప్తంగా

అంగన్‌వాడీ సిబ్బంది ర్యాలీ



పందలపాకలో ర్యాలీ నిర్వహిస్తున్న చిన్నారులు, సిబ్బంది

బిక్కవోలు: మండలంలోని పందలపాక గ్రామంలో చిన్నారులతో కలిసి అంగన్‌వాడీ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. గురువారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ, చిన్నారులు గ్రామంలో ఈ ర్యాలీ చేశారు. మూడు నుంచి ఆరేళ్ల చిన్నారులకు తప్పనిసరిగా అంగన్‌వాడీ విద్య అందించాలని కోరారు.

భారీ అన్న సమారాధన

కోరుకొండ: గ్రామదేవత అంకాలమ్మవారి ఆలయం వద్ద గురువారం భారీ అన్న సమారాధన జరిగింది. ఇటీవల అమ్మవారి ఉత్సవాలు జరిగాయి. ఇందులో భాగంగా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్న సమారాధన నిర్వహించారు. కోరుకొండ, శ్రీరంగపట్నం, జంభూపట్నం, కాపవరం గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకుడు కంబాల శ్రీనివాసరావు 320 మంది మహిళలకు ఉచితంగా పట్టు చీరలు పంపిణీ చేశారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

రాజానగరం: మండలంలోని రాధేయపాలెం సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న పాత తుంగపాడు 11 కేవీ లోకల్ అండ్ అగ్రికల్చర్ ఫీడర్లపై చేపట్టే వార్షిక మరమ్మతుల కోసం శుక్రవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తారు. ఈ కారణంగా పాత తుంగపాడు, కొత్త తుంగపాడుల్లోని అన్ని రకాల విద్యుత్ సర్వీసులకు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ రాజానగరం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఆపరేషన్స్) నటరాజన్ తెలిపారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



కైకవోలు ఉన్నత పాఠశాలలో విద్యార్థికి భోజనం వడ్డిస్తున్న ఎంఈఓ-2

పెదపూడి: విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని నిబంధనల ప్రకారం అందించాలని ఎంఈఓ-2 సీవీవీ సత్యనారాయణ అన్నారు. కైకవోలు, దోమాడ గ్రామాల్లో గురువారం ఆయన మధ్యాహ్న భోజనం తయారీ, విద్యార్థులకు ప్రభుత్వం అందజేస్తున్న సన్న బియ్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు తయారు చేసిన భోజనాన్ని ఆయన రుచి చూశారు. విద్యార్థులకు ఆహారం పంపిణీ చేశారు. పాఠశాలల్లో సమకూర్చిన సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయన వెంట కైకవోలు హైస్కూల్ హెచ్ఎం ఎస్.గోపీకృష్ణ, సర్పంచ్ నూని పట్టాభిరామన్న చౌదరి తదితరులు ఉన్నారు.

వైభవంగా బూరులమ్మ తీర్థం



కొంకుదురులో బూరులమ్మ తల్లిని దర్శించుకుంటున్న భక్తులు

బిక్కవోలు: కొంకుదురు గ్రామంలో బూరులమ్మ తీర్థం గురువారం వైభవంగా జరిగింది. తొలుత అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పీవీవీ సూర్రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు కొంకుదురు పీవీ తదితరులు పాల్గొన్నారు.

జోనల్ క్రీడా పోటీలు

రాజమహేంద్రవరం రూరల్: ఐసీఎస్‌సీఈ జోనల్-ఏ క్రీడా పోటీలు స్థానిక కవలగొయ్యి రోడ్‌లోని ఫ్యూచర్‌కిడ్స్ గ్లోబల్ స్కూల్‌లో గురువారం జరిగాయి. జోనల్-ఏ స్థాయి క్రీడా పోటీలలో ఆర్చరీ, వాలీబాల్ పోటీల్లో తెలుగు రాష్ట్రాల నుంచి ఆరు పాఠశాలల క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రీజనల్ స్థాయిలో జరిగే సీఐసీఎస్‌సీఈ పోటీల్లో పాల్గొంటారని పాఠశాల డైరెక్టర్ యేలేటి రవిబాబు తెలిపారు. విజేతలను ఆయనతో పాటు, పాఠశాల చైర్‌పర్సన్ యేలేటి విజయకుమారి, సీఈవో శ్రీమహశ్వి, ప్రిన్సిపాల్ శేషగిరిధర్, డీన్ హర్షిణి తదితరులు అభినందించారు.

ప్రతిభకు పదును



రంగంపేట శాఖా గ్రంథాలయంలో యోగా నేర్చుకుంటున్న విద్యార్థులు



శిక్షణ అనంతరం ధ్రువపత్రాలు అందుకున్న విద్యార్థులు

- ఆడుతూ పాడుతూ నైపుణ్యాలు పెంపొందించుకున్న విద్యార్థులు
- అనేక అంశాల్లో నిపుణులతో శిక్షణ
- ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరాలు

బిక్కవోలు: అప్పటి దాకా స్కూల్, హోం వర్కులతో క్షణం తీరిక లేకుండా గడిపిన పిల్లలు వేసవి వచ్చిందంటే చాలు ఎంతో రిలాక్స్‌గా ఫీలవుతారు. పూర్తిగా స్వేచ్ఛ లభించినట్లు అల్లరి చేస్తారు. ఇల్లంతా గందరగోళం సృష్టిస్తుంటారు. కొంత మంది చిన్నారులు మాత్రం వేసవిని వృథా చేసుకోకుండా నైపుణ్యాలు పెంపొందించుకున్నారు. గ్రంథాలయాల్లో ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరాల్లో తమకు ఇష్టమైన విభాగాల్లో తర్ఫీదు పొందారు. నియోజకవర్గంలోని గ్రంథాలయాల్లో ఏప్రిల్ 28 నుంచి జూన్ ఆరో తేదీ వరకు వేసవి విజ్ఞాన శిబిరాలు కొనసాగాయి. 35 రోజుల పాటు కొనసాగిన ఈ శిబిరాలు బుధవారం నాటికి ముగిశాయి. వేసవి శిబిరాల్లో ప్రతి రోజు విద్యార్థులు హాజరయ్యారు. ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులు తమకు ఇష్టమైన ఆటపాటలను నేర్చుకున్నారు. డ్రాయింగ్, పేపర్ క్రాఫ్ట్, ఈజీ మ్యాథ్స్, పుస్తక పఠనం, కథలు చదవడం, రాయడం వంటివి నేర్చుకున్నారు. హైదరాబాద్, చెన్నై, విశాఖపట్నం వంటి దూర ప్రాంతాల నుంచి అమ్మమ్మ, నానమ్మ ఇళ్లకు వచ్చిన చిన్నారులు సైతం ఈ శిబిరాల్లో పాల్గొన్నారు. చిన్నారులు ప్రతి రోజు ఉదయాన్నే గ్రంథాలయాలకు వెళ్లి తమకు ఆసక్తి ఉన్న విభాగాల్లో ఉత్సాహంగా శిక్షణ పొందారు.

వేసవి సెలవుల్లో సెల్‌ఫోన్ ప్రపంచంలో మునిగిపోకుండా శిక్షణ శిబిరాల్లో పాల్గొన్న చిన్నారులను పలువురు అభినందించారు. నియోజకవర్గంలోని అనపర్తి, బిక్కవోలు, కొమరిపాలెం, కొంకుదురు, రంగంపేట, పెదపూడి తదితర గ్రామాల్లో ఉన్న శాఖా గ్రంథాలయాల్లో విద్యార్థులు ఆసక్తిగా శిక్షణ పొందారు.

విద్యార్థులకు ఎంతో ఉపయోగం



వేసవి శిబిరాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగం. బాలలు విజ్ఞానాన్ని సముపార్జించే కథలను బాగా చదవాలి. చందమామ, బాలమిత్ర వంటి పుస్తకాలు చదివితే వాటిలో నీతి అర్థమవుతుంది. అలాగే నడవడిక బాగుంటుంది. మా గ్రంథాలయానికి వచ్చే విద్యార్థులకు కథలను బోధించాం. ఉత్సాహంగా ఉండేందుకు ఆటలు నేర్పించాం.

– నల్లమిల్లి రామకోటేశ్వరరావు, గ్రంథాలయాధికారి, రంగంపేట

పుస్తకాలంటే భలే ఇష్టం



నాకు పుస్తకాలు అంటే భలే ఇష్టం. అందులోనూ కథల పుస్తకాలు చదవడం, అందులోని నీతిని తెలుసుకోవడం ఆసక్తికరంగా ఉండేది. ప్రపంచ దేశాలు, భారత దేశ చరిత్రపై కొంత అవగాహన వచ్చింది. ఈ క్యాంప్ నాకు ఉపయోగపడింది.

– పి.జయసాయి, విద్యార్థి, రంగంపేట

యోగా నేర్చుకున్నాను



గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన క్యాంప్ ద్వారా యోగాపై అవగాహన పెరిగింది. ఈజీ గణితంలో లెక్కలు ఎలా చేయాలో తెలిసింది. సెలవులను సద్వినియోగం చేసుకున్నాను. శిక్షణలో తెలుసుకున్న అంశాలను మరిచిపోలేను. ఈ శిబిరం నాకు ఎన్నో నేర్పించింది.

– ఎల్.వరలక్ష్మి, విద్యార్థిని, రంగంపేట

జీకేపై అవగాహన



ప్రతి రోజు న్యూస్ పేపర్లు చదవడం వలన జీకేపై అవగాహన వచ్చింది. చదువుతో పాటు జీకే అవసరమని గుర్తించాను. ఇకపై ప్రతి రోజు పేపర్లు చదువుతాను. ఈ క్యాంప్ వలన పుస్తకాలు, పేపర్ చదవడంలో ఆసక్తి పెరిగింది.

– పడాల మణి సత్యనారాయణరెడ్డి, విద్యార్థి, కొంకుదురు

చెత్త నుంచి సంపద కేంద్రాలు వినియోగంలోకి తేవాలి

డిప్యూటీ ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణరెడ్డి

పెదపూడి: పంచాయతీల్లో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు అన్ని వినియోగంలోకి తీసుకురావాలని డిప్యూటీ ఎంపీడీఓ మేడపాటి సత్యనారాయణరెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ కార్యదర్శులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో తడి, పొడి చెత్తను వేర్వేరుగా చేసి, తడి చెత్త నుంచి వర్మీ కంపోస్టు, పొడి చెత్తను రీసైకిల్ చేసి విక్రయించాలన్నారు. పంచాయతీల్లో సురక్షితమైన మంచినీటి సరఫరా చేయాలన్నారు. సూపర్ క్లోరినేషన్ చేసి, లీకేజీలు ఉంటే వెంటనే సరిచేయాలన్నారు. ఈ నెల 14న యోగాంధ్రాకు సంబంధించి ప్రతి గ్రామ పంచాయతీలో నిర్దేశించిన చోట్ల యోగా డెమో నిర్వహించాలన్నారు. స్వర్ణ గ్రామ పంచాయతీ యాప్‌లో ఇంటి పన్ను డిమాండ్ రిజిస్టర్ దాఖలు చేసి, ఆధార్ నంబర్లతో సహా ప్రతి ఒక్క అసెస్మెంట్ నూరు శాతం అప్‌లోడ్ చేయాలన్నారు. సమావేశంలో పంచాయతీల కార్యదర్శులు బి.ప్రసన్నకుమార్, కనక నాగేంద్ర, సబ్బెళ్ల కృష్ణారెడ్డి, లక్ష్మీనారాయణ, జి.ఉషరాణి తదితరులు పాల్గొన్నారు.

మోగిన బడి గంట



కాంద్రేగులలో జెడ్పీ ఉన్నత పాఠశాలకు వెళుతున్న విద్యార్థులు



స్కూలుకు పోదాం.. రండి..

- పునః ప్రారంభమైన పాఠశాలలు
- ఉదయాన్నే స్కూళ్లకు చేరిన విద్యార్థులు

రాజానగరం: వేసవి సెలవులు ముగిశాయి. విద్యార్థులు, ఉపాధ్యాయులు అంతా గురువారం ఉదయాన్నే పాఠశాలలకు ఉరుకులు పరుగులతో పయనమయ్యారు. ఉల్లాసంతో, ఉత్సాహంతో వచ్చిన విద్యార్థులను ఉపాధ్యాయులు ఆప్యాయంగా కొత్త తరగతుల్లోకి ఆహ్వానం పలికారు. కొత్త పాఠ్య పుస్తకాలను అందించారు. నియోజకవర్గంలోని రాజానగరం మండలంలో 61, కోరుకొండలో 55, సీతానగరం మండలంలో 57 పాఠశాలలు ఉన్నాయి. వీటిలో చదువుకునే 16,548 మంది విద్యార్థుల కోసం ఇప్పటికే మొదటి విడతగా 19,428 పాఠ్య పుస్తకాలు ఆయా పాఠశాలకు చేరవేశారు.

20 నుంచి కిట్ల పంపిణీ

నోట్ బుక్స్, బ్యాగ్‌లు, షూస్, యూనీఫామ్ తదితర వాటితో కూడిన సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కిట్లను పంపిణీకి సిద్ధం చేశారు. ఈ నెల 20 నుంచి నిర్వహించే విద్యా కమిటీలు, తల్లిదండ్రుల సమావేశాలలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయుల సమక్షంలో వీటిని పంపిణీ చేసే విధంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. పాఠశాలలు తెరిచిన మొదటి రోజున ఉత్సాహంగా, ఉల్లాసంగా బడులకు వచ్చే విద్యార్థులను ఆనందపరచే విధంగా పాఠ్య పుస్తకాలను సరఫరా చేశారు.

డొక్కా సీతమ్మ పేరిట..

మధ్యాహ్న భోజన పథకాన్ని మరింత సమర్థవంతంగా నిర్వహించేలా కూడా అధికారులు చర్యలు తీసుకున్నారు. ముతక బియ్యం, ఉండలు చుట్టిన బియ్యం అనే విమర్శలకు తావు లేకుండా, సన్న బియ్యంతో అన్నం తయారుచేసి, వారానికి మూడు రోజులు వేపుడు గుడ్డుతో డొక్కా సీతమ్మ పేరిట మధ్యాహ్న భోజన పథకాన్ని నిర్వహించేలా సన్నాహాలు చేస్తున్నారు.

ఉత్సాహంగా ప్రారంభం

పెదపూడి: వేసవి సెలవుల అనంతరం గురువారం విద్యాసంస్థలు పునఃప్రారంభం కావడంతో విద్యార్థులు ఉత్సాహంగా పాఠశాలలకు వెళ్లారు. మండలంలోని 14 ఉన్నత పాఠశాలలు, 47 ప్రాథమిక పాఠశాలలను తెరిచారు. పాఠశాలకు వెళ్లిన విద్యార్థులు ఒకరికొకరు పలకరించుకుని ఆనందం వ్యక్తం చేశారు. విద్యార్థుల సందడితో పాఠశాలల వాతావరణం ఆనందోత్సాహాలతో నిండిపోయింది.

అనపర్తి: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా మిత్ర కానుకలను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో నాయకులు మాట్లాడుతూ, విద్యార్థులు ఈ కిట్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కిట్ల పంపిణీ

బిక్కవోలు: మండలంలోని పందలపాక శ్రీ పడాల పెద్దపుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సొసైటీ మాజీ అధ్యక్షుడు పడాల సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అందించిన కానుకలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉత్తమ ప్రతిభ కనబరచాలని నాయకులు కోరారు. కార్యక్రమంలో గుణం శ్రీనివాస్ చౌదరి, పంపన వీరబాబు, బొగాది వెంకటరమణ, హెచ్ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి, పీడీ ద్వారంపూడి యువరాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పంపిణీకి సిద్ధంగా ఉన్న పాఠ్య పుస్తకాలు



విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందజేస్తున్న ఉపాధ్యాయులు



పందలపాకలో విద్యార్థి మిత్ర కిట్లు పంపిణీ చేస్తున్న నాయకులు

సేంద్రియ ఎరువులతో నాణ్యమైన దిగుబడి



ఏరువాక కేంద్రంలో శిక్షణ ఇస్తున్న శాస్త్రవేత్త

రాజానగరం: అందుబాటులో ఉన్న సేంద్రియ ఎరువులను ఉపయోగించి పంటలను పండించడాన్ని రైతులు అలవాటు చేసుకోవాలని, తద్వారా ఆరోగ్యవంతమైన పంటలను పండించడంతో పాటు, నాణ్యమైన దిగుబడులు పొందవచ్చని జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త, కో-ఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకటనరసింహారావు అన్నారు. దివాన్‌చెరువులోని కేంద్రంలో వ్యవసాయ పరపతి సంఘాల ఎరువుల డీలర్లకు సర్టిఫికెట్ కోర్సులో ఇస్తున్న శిక్షణా తరగతులు గురువారం నాలుగో రోజు కొనసాగాయి. వివిధ రకాల సేంద్రియ ఎరువులు అనే అంశంపై జరిగిన ఈ కార్యక్రమంలో సేంద్రియ ఎరువుల రకాలు, లభ్యత, వినియోగం, ప్రయోజనాలపై అవగాహన కలిగించారు. మరొక శాస్త్రవేత్త డాక్టర్ మానుకొండ శ్రీనివాస్ మాట్లాడుతూ, నేల ఫలదత, నేల ఆరోగ్యంపై విశదీకరించారు. పలువురు వెలిబుచ్చిన సందేహాలను నివృత్తి చేశారు.

1,268 కిలోల రేషన్ బియ్యం పట్టివేత



పట్టుబడిన నిందితులు, వాహనం

రాజానగరం: తణుకు నుంచి జగ్గంపేటకు అక్రమంగా రవాణా చేస్తున్న 1,268 కిలోల రేషన్ బియ్యం రాజానగరంలో గురువారం పట్టుబడింది. ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. జాతీయ రహదారిపై పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తున్న సమయంలో ఒక వాహనంలో 32 ప్లాస్టిక్ సంచుల్లో మూటలుగా కట్టి రవాణా చేస్తున్న రేషన్ బియ్యాన్ని గుర్తించి, స్వాధీన పర్చుకున్నారు. బియ్యం విలువ రూ.58,328 కాగా, వాహనం విలువ రూ.1.50 లక్షలుగా అంచనా వేశామని స్థానిక ఎంఎస్ఓ బాపిరాజు తెలిపారు. వాహన యజమాని అయిన జగ్గంపేటకు చెందిన మారిశెట్టి గణేష్.. డ్రైవర్ జి.సత్తిబాబు సాయంతో ఈ బియ్యాన్ని తరలిస్తున్నాడన్నారు. నిందితులను పోలీసులకు అప్పగించి, 6ఏ కేసు నమోదు చేశామన్నారు.

జాతీయ పురస్కారానికి కేంద్ర బృందం పరిశీలన



హెడ్ వాటర్ వర్క్స్‌ను పరిశీలిస్తున్న కేంద్ర బృంద సభ్యులు

రాజమహేంద్రవరం సిటీ: నీటి నిర్వహణలో నగరపాలక సంస్థ అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తున్నట్లు కేంద్ర జల వనరుల శాఖ బృంద సభ్యులు సుమన్, లక్ష్మీనారాయణ తెలిపారు. గురువారం నగరంలోని వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, సివేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, కంబాలచెరువు, ఇంకుడు గుంతలను బృంద సభ్యులు పరిశీలించారు. నగరపాలక సంస్థ పరిధిలో నీటి నిర్వహణ పనులను ఆరో జాతీయ జల పురస్కారానికి ఎంపిక చేయడానికి పరిశీలిస్తున్నట్లు వారు వెల్లడించారు. జల కాలుష్య నివారణ, నీటిని పొదుపు చేయడం, పర్యావరణ వ్యవస్థను పునరుద్ధరించడం తదితర అంశాలకు ప్రాధాన్యం ఇస్తారని వివరించారు. ముఖ్యంగా భూగర్భ జలాల పెంపు కోసం నగరపాలక సంస్థ చేపడుతున్న పనులు అభినందనీయమన్నారు. ఈ పనులను పూర్తిస్థాయిలో పరిశీలించిన తర్వాత కేంద్రానికి నివేదిక పంపి, అవార్డు కోసం కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేస్తామన్నారు. బృందం వెంట కార్పొరేషన్ ఏఈలు వెంకటేష్, శ్రీధర్, నగరపాలక సంస్థ సిబ్బంది ఉన్నారు.

ఉపాధికి ఓకేషనల్

- అందుబాటులో వృత్తి విద్య కోర్సులు
- వివిధ విభాగాలపై ఆసక్తి చూపుతున్న విద్యార్థులు
- జీవితంలో స్థిరపడేందుకు దోహదం



ఎంపీహెచ్‌డబ్ల్యులో శిక్షణ పొందుతున్న ఒకేషనల్ విద్యార్థులు

కంబాలచెరువు: మన ముంగిటే ఉపాధి బాట ఉంది. అది అందిపుచ్చుకుంటే భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుంది. అవే వృత్తి విద్యా కోర్సులు. వీటిపై చాలా మందికి తక్కువ విద్య అనే అపోహ ఉంది. ఈ కోర్సులు పూర్తి చేసి, మంచి ఉద్యోగాల్లో స్థిరపడిన వారెందరో ఉన్నారు. వృత్తి విద్యా కోర్సులకు సంబంధించి ఉమ్మడి గోదావరి జిల్లాలకు కలిపి కాకినాడలో ప్రత్యేకంగా ఒక ప్రభుత్వ కళాశాలే ఉంది. రాజమహేంద్రవరంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు, నివ్య ఒకేషనల్ జూనియర్ కళాశాలలున్నాయి. ఆయా కళాశాలల్లో వృత్తి విద్యా కోర్సులు బోధిస్తున్నారు.

పది రకాల కోర్సులు

ఆయా కళాశాలల్లో మొత్తం పది రకాల వృత్తి విద్యా కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఇందులో ఇంజినీరింగ్ గ్రూపులకు సంబంధించినవి కూడా ఉన్నాయి. వాటిలో మెకానికల్ అండ్ ఆటోమొబైల్ ఇంజినీరింగ్, కంప్యూటర్ ఇంజినీరింగ్, సివిల్ ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్, ప్రింటింగ్ టెక్నాలజీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. అలాగే ఆర్ట్స్ విభాగంలో రెండు గ్రూపులు ఉన్నాయి. ఆఫీస్ అసిస్టెంట్ (ఓఏ), అకౌంట్స్ అండ్ టాక్సేషన్ (ఏటీ), పారామెడికల్ విభాగంలో రెండు కోర్సులు బోధిస్తున్నారు. ఎంపీహెచ్‌డబ్ల్యూ (మల్టీపర్పస్ హెల్త్ వర్కర్) ఫిమేల్, ఎంఎల్టీ (ల్యాబ్ టెక్నీషియన్), హోమ్ సైన్స్ హోటల్ మేనేజ్‌మెంట్ విభాగాలు ఉన్నాయి.

తక్షణ ఉపాధి

ఇంటర్‌లో వృత్తివిద్యా కోర్సులు పూర్తి చేసిన వెంటనే ఉపాధి దొరుకుతుంది. బాలికలు ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సు చదివితే ఏఎన్ఎంలు, నర్సులుగా ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో స్థిరపడవచ్చు. ఈ గ్రూపుల్లో విద్యా బోధనకు కళాశాలలో నిష్ణాతులైన అధ్యాపకులు సబ్జెక్టుకు ఇద్దరేసి చొప్పున ఉన్నారు. రెండేళ్ల కోర్సులో ఓ ఏడాది అప్రెంటీస్‌షిప్ ఉంటుంది. మార్కుల లిస్టుతో పాటు ఇచ్చే ఆ ధ్రువపత్రం ఉద్యోగ సమయంలో చాలా ఉపయోగపడుతోంది. ఇంటర్ జనరల్ విభాగం మాదిరిగా కాక మొత్తం వెయ్యి మార్కులు ఉండగా, వాటిలో 500 ప్రాక్టికల్, 500 థియరీ విభాగాలకు ఉంటుంది. ఇక ఇంజినీరింగ్ విభాగంలో ఏదైనా కోర్సు పూర్తి చేస్తే పాలిటెక్నిక్ రెండో ఏడాదిలోకి నేరుగా ప్రవేశించే వెసులుబాటు కలుగుతుంది. రాజమహేంద్రవరం ప్రభుత్వ కళాశాలలో ఒకేషనల్ విభాగంలో గ్రూపునకు 30 చొప్పున సీట్లు కేటాయించారు. అంటే 10 గ్రూపులకు 300 మంది ఒకేషనల్ విద్యార్థులు ఉండాల్సి ఉండగా, అది 400 వరకూ పెరుగుతోంది.

ఉత్తమ ఫలితాలు



వృత్తి విద్యా కోర్సులు చేసిన విద్యార్థులు జీవితంలో మంచిగా స్థిరపడవచ్చు. ఇది కష్టమైన విద్య కాదు. మేథస్సుకు పదును పెడితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చు. ఈ కోర్సులు పూర్తి చేసిన వారు వివిధ రంగాల్లో స్థిరపడ్డారు. ఇంటర్ వృత్తి విద్య కోర్సుల్లో చేరేందుకు ప్రవేశాల గడువు ముగుస్తుంది.

– పి.శ్రీనివాసరెడ్డి, ఒకేషనల్ డీన్, ప్రభుత్వ కళాశాల, రాజమహేంద్రవరం

ఉపాధి అవకాశాలు



వృత్తి విద్యా కోర్సులు పూర్తి చేసిన తర్వాత చక్కని ఉపాధి అవకాశాలు ఉంటాయి. వాటిని సరైన రీతిలో సద్వినియోగం చేసుకుంటే మంచి స్థానంలో స్థిరపడవచ్చు. ఇందులో కొన్ని కోర్సులు చదువుకుంటూనే ఉపాధి వేతనం పొందవచ్చు. దీనికి ఎంఎల్టీ కోర్సు ఉదాహరణ. ఇంజినీరింగ్ విభాగంలో పలు కోర్సులు ఉన్నాయి. వీటిని పూర్తి చేస్తే నేరుగా పాలిటెక్నిక్ రెండో సంవత్సరంలోకి అడుగు పెట్టవచ్చు. అలాగే ఎంసెట్ రాయవచ్చు.

– పి.ఎర్నెస్ట్ మోజెస్, నివ్య ఒకేషనల్ కళాశాల, రాజమహేంద్రవరం

సమస్యల పరిష్కారంలో రాజకీయం వద్దు

రాజానగరం: ప్రజల ఓట్లతో ప్రజాప్రతినిధులమైన వారంతా నిరంతరం ప్రజా సమస్యలపై దృష్టి పెట్టి, వాటిని రాజకీయాలకు అతీతంగా పరిష్కరించేందుకు కృషి చేయాలని ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. స్థానిక మండల ప్రజాపరిషత్ మీటింగ్ హాలులో ఎంపీపీ మండారపు సీతారత్నం అధ్యక్షతన గురువారం మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ పాల్గొన్నారు. తొలుత ప్రభుత్వ శాఖల వారీగా సమీక్షించారు. అనంతరం ఆయా శాఖల ప్రగతిని, చేపట్టబోయే పనులను తెలుసుకున్నారు. సమావేశంలో తహసీల్దారు జీఏఎస్ఎల్ దేవి, సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం, జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెద వెంకన్న, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు కోలపాటి వెంకన్న, మండల కో-ఆప్షన్ సభ్యుడు కోడి రాఘవ, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

యువకుడికి తీవ్ర గాయాలు

రాజానగరం: జాతీయ రహదారిపై స్థానిక వైఎస్సార్ జంక్షన్ వద్ద గురువారం రాత్రి జరిగిన ప్రమాదంలో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన నీలపాల వంశీ తన బైకుపై రాజమహేంద్రవరం వైపు నుంచి ఇంటికి వస్తున్న సమయంలో, ఎదురుగా రాంగ్ రూట్‌లో వచ్చిన ఆయిల్ ట్యాంకర్ ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. తలకు బలమైన గాయం కావడంతో వెంటనే అతడిని చికిత్స కోసం రాజమహేంద్రవరంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. రాజానగరం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.